నిండుకుండలా నాగార్జునసాగర్ రిజర్వాయర్

నేడు తెరుచుకోనున్న సాగర్ క్రస్ట్ గేట్లు

- 574.90 అడుగులకు చేరిన నీటి మట్టం
- శ్రీశైలానికి 4.20 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ)/ న్యూస్‌నెట్‌వర్క్: కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ఆదివారం జూరాలకు ఇన్‌ఫ్లో 2.60 లక్షల క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 2,52,987 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. శ్రీశైలానికి 4.20 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, ఇప్పటికే పూర్తిస్థాయి నీటినిల్వ మట్టానికి చేరుకోగా, దిగువకు వరదను విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు భారీగా ఇన్‌ఫ్లో వస్తుండటంతో నిండుకుండలా మారింది. ఆదివారం 3,21,873 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 37,873 క్యూసెక్కులుగా నమోదైంది. సోమవారం ఉదయం 8 గంటలకు నాగార్జునసాగర్ డ్యాం క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడానికి ఎన్‌ఎస్పీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులకు ప్రస్తుతం 574.90 అడుగులకు చేరుకున్నది. ఇంకా 15 అడుగులు మేర నీరు చేరడానికి మరో రెండు రోజుల సమయం పట్టనున్నది. శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో 19,645 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1,518 క్యూసెక్కులుగా నమోదైంది. కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌కు ఆదివారం 4,87,010 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా బరాజ్‌లోని మొత్తం 85 గేట్లను ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు వదులుతున్నారు.

పెద్దపల్లి జిల్లాలోని నంది పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా ఎగిసి పడుతున్న గోదావరి జలాలు

కాళేశ్వరం లింక్-2లో కొనసాగుతున్న ఎత్తిపోతలు

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 4 : కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2లోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గత నెల 27 నుంచి శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు చేరిన నీటిని ఎత్తిపోస్తుండగా, ఆదివారం నాలుగు మోటర్ల ద్వారా కొనసాగించారు. ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 12,600 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఈ రిజర్వాయర్ 10 గేట్లను ఎత్తడంతో గ్రావిటీ కాల్వ ద్వారా జంట సొరంగాలకు చేరి అక్కడి నుంచి 7, 8వ ప్యాకేజీలలోని కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలి పోతున్నాయి. అక్కడి నాలుగు మోటర్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, అక్కడి నుంచి శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. ఆదివారం వరకు ఎల్లంపల్లి నుంచి 9.8 టీఎంసీల జలాలు మధ్య మానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు డీఈఈ రాంప్రదీప్ తెలిపారు.

కేసీఆర్‌తో మాజీ మంత్రి సబిత భేటీ

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ)/ఆర్మేపురం : మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. శాసనసభలో ఇటీవలి పరిణామాలపై కేసీఆర్ ఆరా తీశారు. అసెంబ్లీ బయట, లోపల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ఎండగట్టిన తీరును ఆయన ప్రశంసించారని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కేసీఆర్ సూచించినట్టు సబిత తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, పట్లోల్ల కార్తీక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్మేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, సాజిద్, జగన్మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, మురళీధర్‌రెడ్డి, నవీన్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె తనయుడు కార్తీక్‌రెడ్డి

కేసీఆర్‌కు సంక్షేమ చిత్రపటం అందజేత

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన వివిధ సంక్షేమ పథకాల సమాహార భారీ పెయింటింగ్‌ను కేసీఆర్‌కు ఇంటీరియర్ డిజైనర్ సౌమ్యారెడ్డి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సౌమ్యారెడ్డిని అభినందించారు. సౌమ్యారెడ్డి అమెరికాలో ఇంటీరియర్ డిజైనర్‌గా గుర్తింపుపొందారు.

వ్యవసాయశాఖలో కదలరు.. వదలరు!

- ఏండ్లుగా పాతుకుపోయిన కొందరు అధికారులు
- జేడీ, డీడీ, ఏవో స్థాయిలో 10-15 ఏండ్లుగా ఒకేచోట విధులు
- హైదరాబాద్ నుంచి కదిలేందుకు ససేమిరా
- పైరవీలు, పలుకుబడి, సంఘాల పేరుతో ఉన్నచోటే తిష్ట
- క్షేత్రస్థాయిలో పనిచేయకుండా తప్పించుకునే యత్నం
- తాజా బదిలీల్లో కదులుతున్న అధికారుల పీఠాలు

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో ఓ అధికారి 17 ఏండ్లుగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే ఆఫీసులో మరో అధికారి 15 ఏండ్లుగా, ఇంకో అధికారి 12 ఏండ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాల్లో ఏవో క్యాడర్ అధికారులను పరిశీలిస్తే.. సుమారు 14 ఏండ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులు ముగ్గురు ఉండగా, 10 ఏండ్లకు పైగా పనిచేస్తున్నవారు 60 మందికిపైగా ఉన్నారు. ఈ విధంగా ఒకేచోట ఏండ్లకు ఏండ్లు తిష్టవేసిన అధికారుల జాబితా చాంతాడంత పెద్దగా ఉన్నది. ఇటు కమిషనరేట్‌లో, అటు జిల్లా ఆఫీసుల్లో వందల సంఖ్యలో అధికారులు ఒకేచోట ఏండ్లుగా పాతుకుపోయారు. అక్కడి నుంచి కదిలేందుకు, ఆ పీఠాన్ని వదిలేందుకు ససేమిరా అంటున్నారు.

నో ఫీల్డ్ వర్క్.. ఓన్లీ హైదరాబాద్

వ్యవసాయ శాఖలో క్యాడర్ ఏదైనా ప్రతి అధికారి కచ్చితంగా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పనిచేయాలి. ప్రస్తుతం వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో ఉన్న కొందరు అధికారులు జిల్లా స్థాయిలో పనిచేసి ఇక్కడికి వచ్చినవారే. ఇందుకు భిన్నంగా అదే ఆఫీసులో కొంతమంది అధికారులు 'కాలికి మట్టి అంటకుండా' ఉద్యోగం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాళ్ల సర్వీస్ మొత్తం హైదరాబాద్‌లోనే ఉన్నట్టు తెలిసింది. ఏదైనా కారణాలతో బదిలీ చేస్తే పైరవీలు, పలుకుబడితో హైదరాబాద్‌లోని వ్యవసాయ అనుబంధ విభాగాల్లోనో, డిప్యుటేషన్‌తో ఇతర శాఖల్లోకి వెళ్తున్నారు తప్ప.. హైదరాబాద్‌ను మాత్రం విడవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫీల్డ్ వర్క్ అనుభవం లేకుండానే హెడ్ ఆఫీసులో కూర్చొని 'పెత్తనం' చేస్తున్నారని ఆ శాఖ అధికారులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరి వల్ల అర్హత ఉన్న క్షేత్రస్థాయి అధికారులు హైదరాబాద్‌కు రాలేకపోతున్నారు. ఓ ఏడీఏ 25 ఏండ్లుగా వ్యవసాయశాఖలో పని చేస్తున్నారు. ఆయన సర్వీస్ మొత్తం జిల్లాల్లోనే చేశారు. ఇప్పుడు కూడా జిల్లాలోనే చేస్తున్నారు. ఆ అధికారి హైదరాబాద్‌కు వచ్చేందుకు ఆసక్తిగా ఉన్నా, ఇక్కడున్న అధికారులు ఆ కుర్చీలను వదలకపోవటంతో ఆయనకు అవకాశం దక్కటం లేదు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ'తో చెప్పి వాపోయారు. 'వాళ్లే తోపులా? మేం పని చేయలేమా? అయినా ఏండ్లుగా వాళ్లే ఉంటే మాలాంటి వాళ్లు పని నేర్చుకునేదెప్పుడు? మేం బానిసల్లా జిల్లాల్లో పని చేయాలి. వాళ్లేమో రాజుల్లాగా హెడ్ ఆఫీసులో కూర్చొని పెత్తనం చెలాయిస్తారా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులను ఈ బదిలీల్లో కచ్చితంగా హైదరాబాద్ దాటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ బదిలీలకు అర్థం లేని స్పష్టం చేశారు. పలువురు అధికారులు కూడా సంఘాల పేరుతో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏఈవో సంఘం నుంచి హెడ్ ఆఫీసు సంఘాల వరకు అందరూ గతంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు కావాల్సిన వారిని కావాల్సిన స్థానాల్లో కూర్చోబెట్టారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయ శాఖలో రెండు సంఘాల మధ్య వైరుధ్యం బహిరంగమే. దీంతో ఎవరికి వారు తమ ప్రాభవాన్ని, బలాన్ని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికైనా ఆ పీఠాలు కదిలేనా?

ప్రస్తుతం వ్యవసాయ శాఖలో వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో బదిలీల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉన్నది. ఇందుకోసం బదిలీ కావాల్సిన అధికారుల జాబితాను రూపొందించారు. ఇందులో ఏండ్లుగా ఒకేచోట ఉన్నవారికి తప్పనిసరి(కంపల్సరీ)గా బదిలీ కింద చూపించగా మరికొందరికి తప్పనిసరి కాదు(నాట్ కంపల్సరీ)గా పేర్కొన్నారు. అయితే ఈ జాబితా ప్రకారం బదిలీలు జరుగుతాయా లేదా అనుమానాలు వ్యవసాయ శాఖ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. జాబితా ప్రకారం చేస్తే కమిషనరేట్‌లో ఏండ్లుగా పాతుకుపోయిన చాలా మంది అధికారులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నది.

ఎల్లంపల్లి జలాశయం

వరద వదిలేసి.. ఉన్న నీళ్లు ఒడగొట్టి!

- రైతు ప్రయోజనాలు పట్టని సర్కారు
- మేడిగడ్డ నుంచి వృథాగా పోతున్న గోదావరి జలాలు
- రోజూ 70 టీఎంసీలు సముద్రం పాలు
- కన్నెపల్లి నుంచి ఎత్తిపోసే అవకాశమున్నా మొండికి..
- ఇన్‌ఫ్లో అంతంతే ఉన్న ఎల్లంపల్లి నుంచి లిఫ్టింగ్
- ఎగువన ముదురుతున్న నార్లు
- బోసిపోతున్న జలాశయాలు.. అడగంటిన భూగర్భ జలాలు
- నీళ్ల కోసం పోరుబాటకు రైతులు సిద్ధం

కరీంనగర్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భవిష్యత్తు అవసరాలకు నిల్వ ఉంచుకోవాల్సి న నీటిని ఒడగొట్టి.. ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. వందలాది టీఎంసీల వరదను మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం సముద్రానికి వదిలేస్తున్నది. మొండికిపోయి కన్నెపల్లి పంప్‌హౌస్‌లను నడుపకుండా ఎగువ ప్రాజెక్టులను, వాటి కింద ఆయకట్టును ఎండబెట్టే ప్రయత్నం చేస్తున్నది. ఇటీవల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన అల్టిమేటానికి దిగొచ్చిన సర్కార్, ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మధ్యమానేరుకు ఎత్తిపోస్తున్న విషయం తెలిసిందే. అయితే ఎల్లంపల్లి పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.4247 టీఎంసీల నీరే నిల్వ ఉన్నది. ఈ నీటిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంపుహౌస్ నుంచి ఏడు మోటర్ల ద్వారా ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా నాలుగైదు మోటర్లతోనే సరిపెడుతున్నది. ఒక్కో మోటర్ సామర్థ్యం 3,150 క్యూసెక్కులు కాగా, ఈ లెక్కన ఏడు పంపుల ద్వారా రోజుకు 22,050 క్యూసెక్కుల నీటిని కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయత్రి పంపుహౌస్‌కు ఎత్తిపోయవచ్చు. అక్కడి నుంచి ఏడు బాహుబలి మోటర్ల ద్వారా రోజుకు 22,050 క్యూసెక్కుల నీటిని మధ్యమానేరుకు ఎత్తిపోయవచ్చు. అంటే దాదాపు రోజుకు రెండు టీఎంసీల నీటిని సులువుగా ఎత్తిపోసుకునేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతానికి ఎల్లంపల్లిలో నీళ్లు అందుబాటులో ఉన్నా మొత్తం మోటర్లు ఆన్ చేయకుండా ప్రభుత్వం నాలుగైదు మోటర్లే నడుపుతున్నది. వరద ఉన్నప్పుడే ఎత్తిపోసుకునే అవకాశాన్ని 'చే'జేతులా జారవిడుస్తున్నది.

అడుగడుగునా అలసత్వం

కాళేశ్వరం జలాల కోసం రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతున్నది. ఎగువన ప్రాజెక్టులు నీళ్ల లేక బోసిపోతుండగా వాటి పరిధిలో భూగర్భ జలాలు అడుగంటి నీరందక నార్లు ముదురుతున్నాయి. మరోవైపు రోజుకు 70 టీఎంసీల నీళ్లు లక్ష్మీ బరాజ్ మీదుగా సముద్రం పాలవుతున్న తీరు రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. ప్రాజెక్టుల్లోకి నీరు వస్తుందన్న ఉద్దేశంతో ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు, ఎల్‌ఎండీ నుంచి ఎస్సారెస్పీ వరకు రైతులు ఇప్పటికే నార్లు పోసుకున్నారు. కొన్ని చోట్ల నాట్లు వేసుకున్నారు. మరికొన్ని చోట్ల నాట్లు వేసుకునేందుకు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సారి ఎత్తిపోసుకునేందుకు కావాల్సినన్ని కాళేశ్వరం జలాలున్నా వివిధ సాకులు చూపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయకుండా దాటవేస్తున్నది. కేటీఆర్ ఇచ్చిన అల్టిమేటంతో దిగొచ్చిన సర్కారు, ఈ నెల 27 నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎత్తిపోతల ప్రక్రియ చేపట్టింది. ఎల్లంపల్లి నుంచి ప్రస్తుతం రోజుకు రెండు టీఎంసీలు ఎత్తిపోసుకునే అవకాశమున్నా పంపులు నడపడం లేదు.

ఎల్లంపల్లిలో నీరు తగ్గితే పరిస్థితేంటి?

నిజానికి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లో అంతంత మాత్రమే ఉంటుంది. ప్రాజెక్టులో వివిధ అవసరాల కోసం 10 నుంచి 12 టీఎంసీల దాకా నీటిని నిల్వ ఉంచాలి. ఇవి అయిపోతే ఎత్తిపోతలకు అందుబాటులో ఉండేనీటి శాతం తక్కువ అవుతుంది. ప్రస్తుత ఇన్‌ఫ్లోను బట్టి చూస్తే మరో మూడు నాలుగు రోజులకు మించి పంపులు నడిచే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లిలో నీళ్లు తగ్గితే ప్రభుత్వం నీటి ఎత్తిపోతలకు మంగళంపాడే పరిస్థితులే కనిపిస్తున్నాయి. అదే జరిగితే లక్షలాది మంది రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్టవుతుంది. అందుకే బీఆర్‌ఎస్ స్పష్టమైన డిమాండ్ చేసింది. కన్నెపల్లి నుంచి ఎత్తిపోస్తే తప్ప కాళేశ్వరం ప్రాజెక్టులు నింపడం అసాధ్యమనే విషయాన్ని సుస్పష్టం చేసింది. నార్లు ముదురుతున్న నేపథ్యంలో కాళేశ్వరం జలాల ఎత్తిపోతలకు డిమాండ్ పెరుగుతున్నది. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ద్వారా ఒక్కో టీఎంసీ చొప్పున కూడవెల్లి, హల్దీ వాగుల్లోకి సాగునీటిని విడుదల చేయాలని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఇప్పటికే డిమాండ్ చేశారు. లేదంటే ఆగస్టు 2న వేలాది మంది రైతులతో రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

ఎగువన వెలవెల.. దిగువన వృథా

ప్రస్తుతం రాష్ట్రంలో మేడిగడ్డకు ఎగువన ఉన్న ప్రాజెక్టులు వెలవెలబోతుంటే అదే మేడిగడ్డ బరాజ్ నుంచి రోజుకు దాదాపు 70 టీఎంసీల నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. ఈ సీజన్‌లో దాదాపు 700కు పైగా టీఎంసీలు సముద్రంలో కలిశాయి. ముందుచూపుతో అధ్యయనం చేసి గోదావరి జలాల ఎత్తిపోతలకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే, దానిద్వారా నీటిని తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా మొండిగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రాజకీయ ప్రయోజనాలను వదిలి ప్రజలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తుండగా తాడోపేడో తేల్చుకునేందుకు రైతాంగం సైతం సమాయత్తమవుతున్నది.

హరీశ్‌రావు లేఖ..దిగొచ్చిన సర్కార్

- మధ్యమానేరు ద్వారా నేటినుంచి సిద్దిపేట జిల్లా రిజర్వాయర్లకు ఎత్తిపోతలు
- సాగునీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ప్రకటన
- హర్షం వ్యక్తంచేస్తున్న అన్నదాతలు

సిద్దిపేట, ఆగస్టు 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఓవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు అడుగంటిన జలాశయాలు ఫలితంగా వానకాలం సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు ఎత్తిపోసి రైతులకు సాగునీరిచ్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. ఈ క్రమంలో రైతుల ఇబ్బందులను మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను నింపి రైతులకు సాగునీరివ్వాలని ఆయన శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం సాగునీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా స్పందించారు. 'మీరు రాసిన లేఖ అందింది.. సోమవారం నుంచి మిడ్‌మానేరు ద్వారా సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తాం' అని హరీశ్‌రావుకు బదులిచ్చారు. దీంతో హరీశ్‌రావుకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వానలు పడితేనే పంట!

- ఎల్‌ఎండీ దిగువకు సాగునీరు కష్టమే
- నిజాంసాగర్, సింగూరు కిందా గగనమే
- గోదావరి బేసిన్‌లో అంతంతే నిల్వలు
- మరిన్ని వర్షాలు కురిస్తేనే సాగుపై ఆశలు
- ఇప్పటికే వెలవెలబోతున్న చెరువులు
- కృష్ణాబేసిన్‌లో మాత్రం సమృద్ధిగా నీళ్లు
- సాగునీటి ప్రణాళికపై అధికారుల మీటింగ్
- 15 రోజులకు మరో సమీక్షకు నిర్ణయం
- ప్రాజెక్టుల వారీగా యాక్షన్ ప్లాన్

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : గోదావరి ఎగువన ఆశించిన వర్షాలు లేకపోవడంతో ఈ ఏడాది ఎల్‌ఎండీ దిగువ ఆయకట్టుకు సాగునీరందడం కష్టంగా మారింది. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా పడుతున్నా ఎస్సారెస్పీలో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో నీటినిల్వలు లేకుండా పోయాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటితో ఎల్‌ఎండీ ఎగువ ఆయకట్టుకే నీరందే పరిస్థితి ఉన్నదని ఇరిగేషన్ అధికారులు చెప్తున్నారు. ఎస్సారెస్పీకి జలాలు రాకుంటే ఎల్‌ఎండీ దిగువ ఆయకట్టుకు సాగునీరందించడం కష్టమేనని తేల్చిచెప్తున్నారు. 2024-25 వానకాలం సాగుకు భారీ, మధ్యతరహా, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు ఏమేరకు సాగునీటిని అందించవచ్చో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (ఎస్సీఐఈఏఎం) ఈఎన్సీ అనిల్‌కుమార్, సీఈ కేఎస్‌ఎస్ చంద్రశేఖర్ నేతృత్వంలో శనివారం ప్రత్యేక సమావేశమై, యాక్షన్‌ప్లాన్‌పై టెరిటోరియల్ వారీగా ఆయా చీఫ్ ఇంజినీర్ల నుంచి ఈఎన్సీ వివరాలు తెలుసుకున్నారు.

కృష్ణ బేసిన్‌లో ఢోకాలేదు..

ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు, ఆయకట్టు విస్తీర్ణంపై సమావేశంలో చర్చించారు. కృష్ణాబేసిన్‌లో ఎగువ ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్రతో పాటు, రాష్ట్రంలోని జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకున్నాయి. ఈ క్రమంలో కృష్ణాబేసిన్ ఆయకట్టుకు ఢోకా లేదని అధికారులు చెప్తున్నారు. బేసిన్‌లోని పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరివ్వాలని నిర్ణయించారు.

ఎస్సారెస్పీ కిందే అనుమానం

కృష్ణాబేసిన్‌తో పోల్చితే ఈసారి గోదావరి బేసిన్‌లో దయనీయ పరిస్థితి నెలకొన్నది. గోదావరి ఎగువన ఆశించిన వర్షాలు లేక ప్రధాన ప్రాజెక్టులకు ఆశించిన జలాలు రాలేదు. దిగువన ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, తాలిపేరు, శబరి తదితర నదులు పొంగిపొర్లడంతో గోదావరి ఉధృతంగా ప్రవహించింది. ప్రాణహిత నుంచే లక్షల క్యూసెక్కుల వరద లక్ష్మీబరాజ్ వద్ద గోదావరిలో కలిసి దిగువకు తరలిపోయింది. ఎస్సారెస్పీ నీటి నిల్వ సామర్థ్యం 90టీఎంసీలు కాగా సగం కూడా నిండలేదు. నిజాంసాగర్ పరిస్థితీ దయనీయంగా ఉన్నది. సింగూరులోనూ నీటి నిల్వలు అంతంతే ఉన్నాయి. కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లికి కొద్ది వరదే వస్తున్నది. దీంతో వాటి ఆయకట్టుకు సాగునీరందించడంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. మరో 15రోజులు చూసి అప్పటికీ వర్షాలు జలాలు రాకుం టే మరోసారి సమీక్షించి వానకాలం ఆయకట్టును ఖరారు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

వెలవెలబోతున్న చెరువులు..

కొంతకాలంగా వానలు పడుతున్నా రాష్ట్రవ్యాప్తంగా చెరువులు వెలవెలబోతున్నాయి. కుంటలు మినహా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 34,716చెరువులుండగా, 15,149 చెరువుల్లో ఇప్పటికీ 25శాతం కూడా నిల్వలు లేకుండా పోయాయి. 6226 చెరువులు 50-75శాతం, 3415 చెరువులు 75-100శాతమే నిండాయి. 3494చెరువులు మాత్రమే మత్తళ్లు దుంకుతున్నాయి. గజ్వేల్, సంగారెడ్డి, వరంగల్, కామారెడ్డి, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని చెరువుల పరిస్థితి దారుణంగా ఉన్నది. వాటి పరిధిలోని ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	33.0°c	28.0°c
రంగారెడ్డి	32.6°c	22.3°c
నల్లగొండ	31.5°c	24.0°c
మెదక్	31.3°c	23.0°c
నిజామాబాద్	31.1°c	24.8°c
ఆదిలాబాద్	31.0°c	24.4°c
వరంగల్	31.0°c	25.0°c
హైదరాబాద్	30.8°c	24.4°c
మహబూబ్‌నగర్	30.0°c	22.3°c
కరీంనగర్	29.0°c	25.0°c

మరో ఐదు రోజులు వానలు

- రాష్ట్రంపై అల్పపీడన ప్రభావం
- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం వర్షాలు కురుస్తాయని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో రుతుపవనాలు చాలా చురుకుగా ఉన్నాయని, తెలుగు రాష్ట్రాలపై కూడా ద్రోణి ప్రభావం ఉందని తెలిపారు. గుజరాత్, కేరళ దగ్గర కూడా మరో ద్రోణి కొనసాగుతుందని, వీటి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మేఘాలు కమ్ముకొని ఉంటాయని చెప్పారు. కొంచెం వేడి, ఉక్కపోత ఉండే అవకాశం ఉందని, సాయంత్రం 4 తర్వాత పశ్చిమ తెలంగాణలో జల్లులతో కూడిన వర్షం మొదలవుతుందని వెల్లడించారు. ప్రధానంగా సిరిసిల్ల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కొత్తగూడెం, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశముందని అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

మరో 3 వేల కోట్ల అప్పు

- మళ్లీ ఆర్బీఐ నుంచి పొందేందుకు చర్యలు
- 8 నెలల్లో రూ.35.148 వేల కోట్ల బాకీ
- బడ్జెట్‌లో ప్రతిపాదించినట్టు 62,012 కోట్ల రుణమే లక్ష్యంగా చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది జూలై 24 నాటికి రూ.35,118 కోట్లు అప్పు తీసుకున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించిన రేవంత్ ప్రభుత్వం.. ఆర్బీఐ వద్ద మరో రూ.3 వేల కోట్లు రుణం తీసుకోవడానికి చర్యలు చేపట్టింది. రూ.వెయ్యి కోట్ల విలువైన మూడు బాండ్లను ఆర్బీఐ వద్ద వేలానికి పెట్టింది. మూడు బాండ్లను వేర్వేరుగా 16 ఏండ్లు, 18 ఏండ్లు, 22 ఏండ్ల కాలానికి ఆర్బీఐకి రాష్ట్ర ఆర్థికశాఖ జారీచేసింది. వీటిని ఈ నెల 6న వేలం వేయనున్నట్టు ఆర్బీఐ తాజాగా వెల్లడించింది. అనంతరం ఆ మొత్తం రాష్ట్ర ఖజానాకు చేరనున్నది. ప్రతి నెల రూ.5 నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్లను విక్రయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీఐ నుంచి అప్పులు తీసుకుంటున్నది.

నిరుడుతో పోలిస్తే 10 వేల కోట్లు ఎక్కువ

ఈ ఏడాది రూ.62,012 కోట్ల రుణ సమీకరణ చేయనున్నట్టు ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. నిరుడుతో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్ర అప్పు పద్దు రూ.10 వేల కోట్లు ఎక్కువ. బహిరంగ మార్కెట్‌లో రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1,000 కోట్లు సమీకరించనున్నట్టు బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 24 నాటికి రూ.35,118 కోట్లు అప్పుగా తీసుకున్నట్టు చెప్పారు. గతంలో ఉన్న అప్పులు, వడ్డీ చెల్లింపుల కింద రూ.42,892 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏటా రూ.6,050 కోట్లు అప్పులు, వడ్డీల కింద చెల్లించాల్సి ఉండేది. కానీ, ఇప్పుడు నెలకు రూ.5,365 కోట్లు చెల్లిస్తున్నట్టు సర్కారు వెల్లడించింది. గతంలో తీసుకున్న అప్పులకు అసలు, వడ్డీ చెల్లింపుల కోసం రూ.30 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఇందులో రుణం చెల్లింపుల కోసం రూ.13,177.60 కోట్లు, వడ్డీ చెల్లింపుల కోసం రూ.17,729 కోట్లు ప్రతిపాదించారు. తెలంగాణ అప్పుల పద్దు ఏటేటా పెరుగుతున్నది. 2022-23లో మొత్తం రాబడుల్లో రూ.44,060 కోట్లు రుణాల కింద వచ్చాయి. 2023-24లో రూ.52,576 కోట్లు తీసుకున్నారు. ఈ ఏడాది అప్పు పద్దు కింద రూ.62 వేల కోట్లు చూపించారు.

'పెదవాగు'పై నేడు జీఆర్‌ఎంబీ సమావేశం

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): అశ్వారావుపేట పెదవాగు ప్రాజెక్టుకు గండి పడిన నేపథ్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో చర్చించేందుకు గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్‌ఎంబీ)సోమవారం సమావేశం నిర్వహించనున్నది. వరద ఉధృతంగా ఉన్నప్పుడు సకాలంలో ప్రాజెక్టు గేట్లు తెరవకుండా నిర్లక్ష్యం చేసినందునే ప్రాజెక్టుకు గండి పడిందని ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. గోదావరి బేసిన్‌లో ఇరు రాష్ట్రాలకు సంబంధించి ఉన్న ఏకైక ఉమ్మడి ప్రాజెక్టు పునరుద్ధరణకు గతంలోనే జీఆర్‌ఎంబీ ప్రతిపాదనలు చేసింది. నిధుల అంచనా వేసింది. తాజాగా అదే ప్రాజెక్టుకు గండిపడిన నేపథ్యంలో మరమ్మతులు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు బోర్డు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నది. 6న సమీకృత సీతారామ ప్రాజెక్టు అనుమతుల అంశంపైనా సమావేశంలో చర్చించనున్నది.

సెల్ఫీ తీసుకుంటూ లోయలో పడ్డ మహిళ

- రక్షించిన స్థానికులు

పూణె: స్నేహితులతో కలిసి సెల్ఫీ తీసుకుంటూ ఉండగా లోయలో పడిన మహిళను(29) స్థానికులు రక్షించిన ఘటన మహారాష్ట్రలోని సతారా జిల్లా బోర్నే ఘాట్‌లో శనివారం జరిగింది. 100 అడుగులు ఉన్న లోయలో నుంచి ఆమెను స్థానికులు, హోం గార్డులు తాడు సాయంతో రక్షించి స్థానిక దవాఖానకు తరలించారు.